పసుపు క్వింటాలు @ రూ.14,921

మెట్‌పల్లి, ఏప్రిల్ 16: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పసుపు ధర రైతులకు కొంత ఉపశమనం కలిగించింది. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 14,921, కనిష్ఠంగా రూ.4 వేలు, గోళకు గరిష్ఠంగా రూ. 14,416, కనిష్ఠంగా రూ.4 వేలు, పసుపు చూరకు గరిష్ఠంగా రూ.11,777, కనిష్ఠంగా రూ.9,111 పలికింది. 212 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 27367 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

రైతులకు అవగాహన

గొల్లపల్లి/సారంగాపూర్, ఏప్రిల్ 16: గొల్లపల్లి, సారంగాపూర్ రైతు వేదికల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్నదాతలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి, ఏవో కరుణ, తిరుపతి నాయక్, ఏఈవోలు అశ్విని, గంగాధర్, వంశీ, అలేఖ్య, శ్రీహరి, వెంకటేశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్లు ఎంపిక

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 16: మియాపూర్‌లో ఈనెల 25 నుంచి జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా బాల బాలికల జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. బాలుర జట్టులో మంజునాథ్, శ్రీచరణ్, అభినవ్, అఖిల్, రామ్‌చరణ్, ప్రీతం, రోహన్, చరణ్, రాహుల్, వర్షిత్, సాకేత్, సాయిశ్రీ, బాలికల జట్టులో శరణ్య, వర్షిత, అక్షిత, శరణ్య, సంజన, సహస్ర, అర్చన, సుధాన్వి, హారిక, పూజ, కీర్తన, సమీక్ష ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వప్రసాద్, నిరంజన్, రవికుమార్, కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వేణు, రాజ్‌కుమార్, శశి, మంగ, విజ్ఞాన్, శ్రీరామ్, సామంత్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

సారంగాపూర్: మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

- ముఖ్యమంత్రి ఓ ఝూటా కోర్
- బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- బీర్‌పూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎన్నికల ఇన్‌చార్జి లోక బాపు రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీర్‌పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయనతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎన్నికల ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఓ ఝూటా కోర్ అని విమర్శించారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓటు వేసి గెలిపించారని అన్నారు. ఎంపీ అర్వింద్‌కు ప్రజలకు తన ముఖం చూపించే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రోళ్లవాగు ప్రాజెక్ట్ పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్మించి మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని అన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలని కోరారు. అనంతరం స్థానిక లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. సమావేశంలో కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారపాక రమేశ్, మాజీ ఎంపీపీ కొల్ముల రమణ, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నల్ల మహిపాల్ రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు గాజర్ల రాంచంద్రం గౌడ్, నాయకులు మెరుగు రాజేశం, ఎడ్ల సుశిన్, హరీశ్, శీలం రమేశ్, ముక్క శంకర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

మల్లాపూర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం స్థానిక కేఎంఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంత్రి పదవికి జీవన్‌రెడ్డి అడ్డువస్తున్నారనే కారణంతో అధిష్ఠానం ఎంపీ ఎన్నికల బరిలో నిలిపినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, సింగిల్‌విండో చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, మోహన్‌రెడ్డి, బద్దం అంజిరెడ్డి, ఆర్బీఎస్ మాజీ జిల్లా డైరెక్టర్ దేవ మల్లయ్య, మాజీ మండలాధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మైదాస్ శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి, టీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు మేకల సతీశ్, సోషల్ మీడియా విభాగం మండలాధ్యక్షుడు మహ్మద్ రఫీ, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు కార్యాలయం చూపించాలి

పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు ఎంపీ అర్వింద్ అసత్యపు ప్రచారం చేస్తున్నాడు. అసలు పసుపు బోర్డు కార్యాలయం ఎక్కడ ఉందో చూపించాలి. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ప్రధాని మోదీ, పలు రాష్ట్రాల సీఎంలను కలిసి విన్నవించాం. ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో ప్రజలు నిలదీయాలి. ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ రాముడి పేరిట రాజకీయం చేయడం సరికాదు. ప్రజల సమస్యలు తెలిసిన ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలి.

- కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరువు కూడ వచ్చింది. తాగు, సాగు నీటి కోసం ప్రజలు గోస పడుతున్నరు. బీఆర్ఎస్‌తో అభివృద్ధి సాధ్యం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలి. కేసీఆర్ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించాలి. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి.

-డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్

అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. సీఎం కేసీఆర్ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేశారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ మాయ మాటలను నమ్మి మోసపోవద్దు. బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి.

- సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే, కోరుట్ల

భారీ మెజార్టీతో గెలిపించాలి

కులాలు, మతాల పేరిట బీజేపీ రాజకీయం చేయడం సరికాదు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని జగిత్యాలలో ఓడించిన ఘనత ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యకర్తలకే దక్కుతుంది. ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎంతగానో కృషి చేశారు. బీర్‌పూర్ మండల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

-దావ వసంత, జడ్పీ చైర్‌పర్సన్

ధాన్యం ఆరబెట్టి తీసుకురావాలి

ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఏప్రిల్ 16: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఆరబెట్టి తీసుకు రావాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా రైతులకు సూచించారు. జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు సమస్యలు ఎదురైతే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800 425 8187లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సంపత్ రావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హతిరాం, జగిత్యాల రూరల్ తహసీల్దార్ రామ్ మోహన్, ఐకేపీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న న్యాయమూర్తి

మల్యాల, ఏప్రిల్ 16: కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం జిల్లా జడ్జి నీలిమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. అలాగే, హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సునీల్, స్థానాచార్యుడు కపీందర్‌స్వామి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, శ్రీనివాసశర్మ, ఇన్‌స్పెక్టర్లు సంపత్, లక్ష్మీరాజం, ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం తనిఖీ

మల్యాల, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ తనిఖీలు చేపట్టారు. మల్యాల బ్లాక్ చౌరస్తాలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో నీరంతా రోడ్డుపైకి వస్తున్నదని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. మల్యాల, ముత్యంపేట గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ఇరు గ్రామాల కార్యదర్శులను ఫోన్‌లో ఆదేశించారు.

మాజీ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేత

మాజీ మంత్రి ఈశ్వర్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెగడపల్లి, ఏప్రిల్ 16: కరీంనగర్‌లోని నివాసంలో మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను మంగళవారం నామాపూర్‌శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమురవెల్లి ఆనందం, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

గొల్లపల్లి, ఏప్రిల్ 16: ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని డీఆర్డీవో సంపత్ రావు అధికారులు ఆదేశించారు. మండలంలోని శంకర్‌రావుపేట్, వెంగళాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామిరెడ్డి, ఏపీఎం త్రివేణి, ఏఈవో గంగాధర్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

సారంగాపూర్/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16: గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని బీర్‌పూర్, ఇబ్రహీంపట్నం మండలాల వ్యవసాయాధికారులు అనూష, లావణ్య సూచించారు. బీర్‌పూర్, ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవోలు మాట్లాడుతూ, ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. సమావేశాల్లో ఏఈవోలు సంతీఫ్, మాధవ్, దీపిక, ఎంఏవోలు నరేశ్, రవళి, హరీశ్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

చంద్రపతి కుటుంబసభ్యులకు ఎల్వోసీ పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, ఏప్రిల్ 16: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన తుపాకుల చంద్రపతి కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాగా, గ్రామ బీఆర్ఎస్ నాయకుడు గాదె శ్రీనివాస్ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, రూ. లక్షా 50 వేల ఎల్వోసీ మంజూరు చేయించారు. మంగళవారం చంద్రపతి కుటుంబ సభ్యులకు ఎల్వోసీ మంజూరు పత్రం అందజేశారు. పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు చేని సురేందర్, యూత్ మండల కార్యదర్శి శ్రీ పాల్, నాయకులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 16: మాదిగలకు నమ్మక ద్రోహం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం పేర్కొన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూమాల గంగారాం, అధికార ప్రతినిధి సతీశ్, ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు సురుగ శ్రీనివాస్, నాయకులు చెట్‌పెల్లి లక్ష్మణ్, బొనగిరి కిషన్, చిర్ర లక్ష్మణ్, శేఖర్, మహేశ్, రాజశేఖర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 16: రాంపూర్ గ్రామ శివారులోని వరద కాలువ నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఏఈఈ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎక్స్‌వేటర్ యజమాని గంగాధర్, టిప్పర్ డ్రైవర్ బంగారపు రమేశ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 16 : పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ భారతీనారాయణ్ భట్, తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అదనపు కలెక్టర్ దివాకర
- హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లపై సమీక్ష

మల్యాల, ఏప్రిల్ 16: కొండగట్టు అంజన్న ఆలయంలో ఈనెల 22 నుంచే నిర్వహించే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. కొండగట్టు అంజన్న ఆలయ కార్యాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో పాటు ఆలయ అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన హనుమాన్ చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దివాకర మాట్లాడుతూ, గతంలో తలెత్తిన ఇబ్బందులు ఈసారి పునరావృతం కాకుండా చూడాలని ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈఈ లక్ష్మణ్‌రావును ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని, వాహనాల క్రమబద్ధీకరణ, కమాండ్ కంట్రోల్ రూం నుంచి పరిస్థితులను పర్యవేక్షణ చేయాలని పోలీసులకు సూచించారు. డీపీవో దేవరాజ్, ఆలయ సిబ్బంది సమన్వయంతో ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కొండపైన విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఫైర్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలన్నారు. దీక్షాపరులకు ఆలయ పరిధిలో ఏఏ సౌకర్యాలు ఎక్కడ ఉన్నాయో తెలిసేలా ప్రత్యేక చార్టులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు, భక్తుల రద్దీకి అనుగుణంగా క్షురకులు, ప్రసాద కౌంటర్ల ఏర్పాటు, కోనేరులో నీళ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఉత్సవాలకు నోడల్ అధికారిగా ఆర్డీవో మధుసూదన్ వ్యవహరిస్తారని, క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తితే ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఆర్డీవో పులి మధుసూదన్, డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, డీపీవో దేవరాజ్, డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, తహసీల్దార్లు మునీందర్, రాజమణి, ఎంపీడీవోలు స్వాతి, స్వరూప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే

కేసీఆర్‌తో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్లకు చెందిన పలువురు బీఆర్ఎస్, ఎంఐఎం కౌన్సిలర్లు, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీం, కౌన్సిలర్లు సజ్జు, పేర్ల సత్యం, సాబీర్ అలీ, నాయకులు రఫీ, యాటం అరుణ్, మురళి, రాజేశం, రహీం, బాబా, తదితరులున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

విద్యుత్ శాఖ ఇంజినీర్లతో మాట్లాడుతున్న సీజీఎం ప్రభాకర్

మెట్‌పల్లి, ఏప్రిల్ 16: వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగినందున అందుకు అనుగుణంగా సరఫరాలో లోపాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని వరంగల్ చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్ ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఇంజినీర్లతో మంగళవారం ఆయన విద్యుత్ సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగిందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే తప్పా లైన్ క్లియర్లు తీసుకోకూడదని, సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా కోసం నిర్దేశించిన ఫీడర్లకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయం సమయం లెక్కించడానికి కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ సైదీ.. సైఫీ గురించి వివరించారు. సమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ, డీఈలు తిరుపతి, గంగారాం, రవీందర్, రాజారెడ్డి, ఏడీఈలు మనోహర్, నగేశ్, శ్రీనివాస్‌రావు, రఘుపతి, ఆంజనేయరావు, ఏఈలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

జగిత్యాల, ఏప్రిల్ 16: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి నరేశ్ సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి నరేశ్ మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాల కమిటీల బాధ్యతలు, చేపట్టే పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, ఎంపీడీవోలు, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

రాయికల్: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయికల్/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి, ఏప్రిల్ 16: రాయికల్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఇబ్రహీంపట్నం, మేడిపల్లి మండలాల ప్రత్యేకాధికారులు రఘువరన్, మదన్‌మోహన్, ఎంపీడీవోలు చిరంజీవి, రాజేందర్‌రెడ్డి, చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్, ఎంపీవోలు సుష్మ, కృపాకర్, శ్రీనివాస్, ఎంఈవోలు గంగాధర్, ఆనంద్‌రావు, ఏపీఎం చక్రవర్తి, శంకర్, అశోక్, పంచాయతీరాజ్ ఏఈ విజయ్, ప్రధానోపాధ్యాయులు, సీసీలు, వీవోలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

జగిత్యాల, ఏప్రిల్ 16: పట్టణంలోని అల్ఫోర్స్ టెక్నో స్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రాథమిక విద్య పిల్లల భవిష్యత్‌కు పునాది లాంటిదని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం యూకేజీ పూర్తయిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుల ఔదార్యం

కథలాపూర్, ఏప్రిల్ 16: కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన ఓ మహిళకు గుండె శస్త్ర చికిత్స కోసం రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న పెగ్గెర్ల గ్రామానికి చెందిన ఎం ప్రణీత్, సీహెచ్ శ్రీకాంత్, భూషణరావుపేట గ్రామానికి చెందిన ఎస్ అరుణ్, ఎం వినోద్, పీ గంగాధర్ మంగళవారం కరీంనగర్‌లోని దవాఖానకు వెళ్లి రక్తదానం చేశారు.

నగదు పట్టివేత

మల్లాపూర్, ఏప్రిల్ 16: మండలంలోని రాఘవపేట గ్రామ శివారులో ఎలాంటి ఆధారాలు లేకుండా మంగళవారం ఓ వ్యక్తి రూ. 98 వేలు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని కోరారు.

మున్సిపల్ అధికారిపై ఫిర్యాదు

మారుతీనగర్, ఏప్రిల్ 16: గతేడాది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి వినియోగించుకున్న టెంటు, కుర్చీలకు సంబంధించిన బిల్లు ఇవ్వకుండా మెట్‌పల్లి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుర్రం రత్నాకర్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మెట్‌పల్లి టెంట్‌హౌస్ యూనియన్ అధ్యక్షుడు కోటగిరి అరుణ్‌గౌడ్ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ విషయమై మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా తాను నెల క్రితమే బాధ్యతలు చేపట్టానని, టెంటు బిల్లు విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 16: పైడిమడుగులోని మల్లికార్జున స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు సురికంటి సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ అడిక్షన్‌పై అవగాహన

జగిత్యాల, ఏప్రిల్ 16: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జగిత్యాల హెల్త్ క్లబ్, ఎన్ఎస్ఎస్, జువాలజీ విభాగం సంయుక్త నిర్వహణలో డ్రగ్ అడిక్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ, ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ విశాల్, డాక్టర్ ఆశ మౌనిక, డాక్టర్ సాకేత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మసరు సుల్తానా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హజ్ జ్యోతికౌర్, డాక్టర్ ఏ జ్యోతిలక్ష్మి, డాక్టర్ మామిడిపల్లి సత్యప్రకాశ్, డాక్టర్ కిరణ్మయి, చంద్రయ్య, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ జమున, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.